సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 3 । మే । 2023



మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

బ్రహ్మంగారిమఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. - 8లో



వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

వెల్లాల గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వాముల కల్యాణం వైభవంగా జరిగింది. - 8లో



నెల్లూరు, అనంతపురం జట్ల విజయం

ఏసీఏ అండర్–23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. - 8లో

పేద పిల్లలకు కార్పొరేట్ చదువు



తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య
- తొలి విడతలో 339 మందికి ప్రవేశం
- ఐదేళ్లు నిండిన వారికి 1వ తరగతిలో ప్రవేశాలు
- అత్యధికంగా కడపలో 97 మంది చేరిక
- పారదర్శకంగా ఎంపిక
- త్వరలో రెండవ విడత ఎంపికలు

కడప ఎడ్యుకేషన్‌: ఒకనాడు ఉన్నత వర్గాలకే పరిమితమైన ప్రైవేటు, కార్పొరేట్ విద్యను నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకు చేరువ చేశారు. రూపాయి ఖర్చు లేకుండా 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు కార్పొరేట్ విద్య అందనుంది. ఇలా ప్రతిఏటా జిల్లాలో ఉన్న ప్రవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదవారికి దక్కనున్నాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత చదువులు వరిస్తుండటంతో వారు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం....

విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో జిల్లావ్యాప్తంగా 488 ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిలో 25 శాతం సీట్లను ఉచిత విద్యకు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు జిల్లాలోని 477 పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించి విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 5 ఏళ్లు నిండిన వారికి మాత్రమే 1వ తరగతిలో ప్రవేశం కల్పిస్తుండగా రిజిస్ట్రేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తున్నారు.

రిజర్వేషన్లు ఇలా..

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం రిజర్వేషన్లను కేటాయించింది. ఇందులో ఆడపిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం సీట్లు, ఎస్టీలకు 4 శాతం సీట్లు, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యుఎస్ వర్గాలకు 6 శాతం సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

27 మండలాల పరిధిలో....

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లలో భాగంగా 27 మండలాల పరిధిలో 417 మంది విద్యార్థులకు లాటరీ పద్ధతిలో మొదటి విడత సీట్లు ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటి వరకు 339 మంది వివిధ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. ఇందులో అత్యధికంగా జిల్లా కేంద్రమైన కడపలో 97 మంది ఎంపికయ్యారు. అలాగే ప్రొద్దుటూరులో 34 మంది, ఖాజీపేటలో 25 మంది, పోరుమామిళ్ల, పులివెందుల్లో 24 మంది విద్యార్థులు పలు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు. వీరందరికీ ప్రభుత్వమే ఫీజులు చెల్లించనుంది. త్వరలో రెండవ విడతకు ఎంపికలు జరగనున్నాయి.

మండలాల వారిగా ఎంపిక ఇలా...

మండలం	ఎంపికైనవారు	చేరినవారు
బి.మఠం	4	4
బద్వేల్	5	5
సికెదిన్నె	3	3
చాపాడు	3	3
చెన్నూరు	6	5
కడప	109	97
దువ్వూరు	3	1
గోపవరం	18	16
జమ్మలమడుగు	22	11
కలసపాడు	2	2
కమలాపురం	21	21
ఖాజీపేట	29	25
కొండాపురం	5	5
లింగాల	1	1
ముద్దనూరు	3	3
మైదుకూరు	15	14
పెండ్లిమర్రి	5	5
పోరుమామిళ్ల	24	24
ప్రొద్దుటూరు	61	34
పులివెందుల	28	24
రాజుపాలెం	1	1
సిద్ధవటం	6	4
వల్లూరు	4	4
వేంపల్లి	5	4
వేముల	3	2
ఒంటిమిట్ట	12	10
ఎర్రగుంట్ల	19	14

పారదర్శకంగా ఎంపిక...



జిల్లాలో మొదటి విడతలో 417 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. వివిధ స్కూళ్లకు విద్యార్థులను లాటరీ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఎంపిక చేశాం. త్వరలో రెండవ విడత ఎంపిక కూడా చేయాల్సి ఉంది. ఎంపికైన విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయరాదు. ముందు ముందు వీరి పర్యవేక్షణను ఆయా మండలాల ఎంఈఓలు చూడాల్సి ఉంటుంది.

– ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ

రిజిస్ట్రేషన్ జరిగిన పాఠశాలలో కచ్చితంగా ....



విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి పాఠశాలలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయింపు ఖచ్చితంగా అమలు జరగాలి. ఈ విషయంలో ఎవరైనా అమలు జరపకపోతే చర్యలు ఉంటాయి. మొదటి విడతలో 339 మందికి వివిధ పాఠశాలల్లో సీట్లు లభించాయి. త్వరలో రెండవ విడత ఎంపిక కూడా ఉంటుంది. అర్హులైన వారు ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మార్తల వెంకట క్రిష్టారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

న్యూస్‌రీల్

వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాలు



కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో మూడు క్రీడాంశాల్లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు మేనెల 1 నుంచి 31వ తేదీ వరకు స్విమ్మింగ్, ఆర్చరీ, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిపుణులైన శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైవీయూలో ఎన్ఎస్ఎస్ నూతన పీఓల నియామకం



ఎన్ఎస్ఎస్ పీఓలకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య కృష్ణారెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ల నియామకం జరిగింది. నూతనంగా డా. ఎస్.వి. వెంకటరమణ (సహ ఆచార్యులు, జువాలజీ), డా. ఎం. శ్రీధర్‌రెడ్డి (సహ ఆచార్యులు, పర్యావరణ శాఖ), డా.ఎస్.సునీత (సహ ఆచార్యులు, అనువర్తిత గణితశాస్త్రశాఖ), డా. కె. శ్రీనివాసరావు (సహ ఆచార్యులు, కంప్యూటర్‌సైన్స్)లకు నియామక పత్రాలను మంగళవారం ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అందజేశారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో వీరికి నూతన పీఓలుగా నియామక పత్రాలు అందజేశారు.


జిల్లాలో వర్ష సూచన

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి 7వ తేదీ వరకు పలు మండలాల్లో తేలికపాటి వర్ష సూచన ఉన్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ వీరయ్య, వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని 35 మండలాలు, 7 మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న 141 వలంటీర్ పోస్టుల నియామకానికి ఈనెల 4వ తేది నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించి, 7వ తేది స్క్రూటినీ నిర్వహిస్తామన్నారు. సెలెక్షన్ కమిటీ ఈనెల 8, 9 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 10వ తేదీ సమాచారాన్ని పంపుతామని, 11వ తేది శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

పశుగణాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లాలో పశుగణాభివృద్ధికి పశువైద్యులు కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మాధవరెడ్డిలు పేర్కొన్నారు. కడపలోని పశుసంవర్ధకశాఖ డివిజన్ కార్యాలయంలో వివిధ అనుబంధశాఖల అధికారులతో మంగళవారం సంబటూరు ప్రసాద్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులలో వచ్చే వ్యాధుల గురించి, వాటికి ముందు జాగ్రత్తగా వేసే టీకాల లభ్యత గురించి చర్చించారు. అలాగే పశునష్ట పరిహారం కింద ఇంకా ఎన్ని నిధులు అవసరం అవుతాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మను అడిగి తెలుసుకున్నారు. ఇంకా రాని వాటి గురించి ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్. మాధవరెడ్డి మాట్లాడుతూ పెయ్య దూడల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని చాలా పశువైద్యశాలల్లో మహిళా పశువైద్యులు పనిచేస్తున్నారని వారికి వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో డీఏల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, కడప డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులు రమణారెడ్డి, పశు వైద్యుల సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ శివరామిరెడ్డి, ఖాజీపేట సహాయ సంచాలకులు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి



న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి

కడప అర్బన్: న్యాయం కోసం అందరం సమన్వయంతో విధులను నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. మంగళవారం కడప న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) అధ్యక్షుడు జి.వి. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నూతన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తితో కడప న్యాయవాదుల సంఘం భవనంలో న్యాయవాదులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఒకప్పుడు తాను కూడా న్యాయవాదిగా పనిచేశానని, న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో క్రిమినల్ కోర్టుల భవన సముదాయ నిర్మాణ పనుల ప్రతిపాదనలు పెండింగ్‌లో వున్నట్లు తన దృష్టికి కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీసుకువచ్చారన్నారు. ఈ పనులు త్వరగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ఈనెల 13న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌లో అధికసంఖ్యలో కేసులను పరిష్కరించే విధంగా న్యాయవాదులంతా సహకరించాలని ఆయన కోరారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సీ.ఎస్ మూర్తి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.ఎస్. బాలసుబ్రమణ్యం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మోడల్ టౌన్ అభివృద్ధి పనుల పరిశీలన

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అంతకమునుపు సుమారు రూ.16కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ గదులను ఆయన పరిశీలించారు. వ్యాపారుల కోసం నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ గదులను నాణ్యతగా నిర్మించి త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే మూడవ విడతలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మోడల్ టౌన్‌కు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గరాండాల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం మోడల్ టౌన్‌కు సంబంధించిన మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కాంట్రాక్టర్ కోడి రమణ, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

విద్యా కానుక కిట్లు సిద్ధం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను అన్ని పాఠశాలల్లో పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాలులో నాడు–నేడు ఫేజ్–2 పనుల పురోగతిపై జేసీ గణేష్ కుమార్‌తో కలిసి విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మన బడి నాడు–నేడు పనులను ఈనెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. జూన్‌లో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నాటికి కిట్లను అన్ని రకాల కాంపోనెంట్‌లతో కలిపి సిద్ధం చేయాలన్నారు. ఎంఈఓలు, ఏపీఓలు వారి పరిధిలోని పాఠశాలలకు కిట్లు కొరత లేకుండా చూడాలన్నారు. రెండవ దశ నాడు–నేడు పనులకు పది కాంపోనెంట్స్ ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లో ఈనెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి గ్రంథాలయ సంస్థ వేసవి శిబిరం

కడప కల్చరల్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి జూన్ 11వ తేది వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నామని సంస్థ జిల్లా చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి తెలిపారు. జిల్లా కేంద్రం కడప నగరంలోని ప్రధాన గ్రంథాలయంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 62 శాఖా గ్రంథాలయాలలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పిల్లలలో పుస్తకాలు చదివే అలవాటు పెంచేందుకు వారిలోని సృజనాత్మక శక్తిని గుర్తించి అభ్యసనం చేసేలా తీర్చిదిద్దడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6 నుంచి 10వ తరగతి చదివే పిల్లలకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా కథలు చదివి వినిపించడం, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం 'చదవడం మాకిష్టం' ద్వారా పుస్తకాలను చదివించడం చేస్తామన్నారు. అలాగే స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, అతిథులతో ప్రసంగాలు, డ్రామా, వ్యక్తిత్వ వికాస ప్రసంగాలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. శిబిరాల్లో పిల్లలకు ఈ అంశాలు బోధించేందుకు ఆసక్తిగల రీసోర్స్ పర్సన్లు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు గ్రంథాలయ అధికారులను సంప్రదించాలన్నారు.

నిధుల విడుదలపై సీఎం సానుకూల స్పందన

ముఖ్యమంత్రిని కలిసిన డిప్యూటీ సీఎం, మేయర్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరాభివృద్ధికి సంబంధించి నిధుల విడుదలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ కె.సురేష్ బాబు తెలిపారు. మంగళవారం విజయవాడలోని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వారు ముఖ్యమంత్రిని కలిసి నగరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఇతర అంశాల గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా బుగ్గవంక అప్రోచ్ రోడ్లు రెండింటికీ రూ.11కోట్లు విడుదల చేయాలని, రోడ్డు విస్తరణ పూర్తయిన అంబేడ్కర్ సర్కిల్–వై జంక్షన్, గోకుల్ లాడ్జి– అన్నమయ్య సర్కిల్, క్రిష్టా సర్కిల్– దేవునికడప రహదారులకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని, బీఆర్ఎస్ ఇచ్చి టోకెన్ ఇచ్చేలా చర్యలు తీ సుకోవాలని విన్నవించారు. అలాగే పాతకడప చెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరారు. వీటన్నింటిపై సీఎం సానుకూలంగా స్పందించి, నిధులు విడుదలకు ఆదేశించినట్లు డిప్యూటీ సీఎం, మేయర్ తెలిపారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమ బాబు ఉన్నారు.

భూ రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

అట్లూరు: భూముల రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని యర్రబల్లి రెవెన్యూ పొలంలో తహసీల్దారు శ్రీవాణి ఆధ్వర్యంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను వారిరువురు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు రెవెన్యూ పొలం రికార్డులతో పాటు మ్యాపును పరిశీలించారు. అలాగే రికార్డులను పరిశీలించారు. రికార్డుల ఆధారంగా రీసర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం తంబళ్లగొంది సచివాలయాన్ని పరిశీలించారు. అక్కడ సిబ్బందితో విధి విధానాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజినల్ సర్వేయర్ మల్లికార్జున నాయుడు, మండల సర్వేయర్ శ్రీనివాసన్, సచివాలయ సర్వేయర్ నరసింహారెడ్డి, వీఆర్ఓ వెంకటసుబ్బమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్, ఆర్డీఓ వెంకటరమణ

నేటి నుంచి దేవుని కడపలో తెప్పోత్సవాలు

- జల విహారం చేయనున్న కడప రాయుడు
- పూర్తయిన ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. జిల్లాలో అత్యంత పురాతనమైన ఆలయాలలో కడప రాయుని ఆలయం ఒకటి. చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఈ క్షేత్రానికి ఎంతో పేరుంది.

- జనవరి చివరిన బ్రహ్మోత్సవాలు, మే మాసంలో తెప్పోత్సవాలు జరుగుతాయి. బుధ, గురు, శుక్ర వారాలలో జరగనున్న తెప్పోత్సవం కోసం ఇప్పటికే తిరుపతి నుంచి ప్రత్యేకంగా తెప్పను తెప్పించి ఉంచారు. పుష్కరిణిలోని నీటిని మూడు రోజుల క్రితం పూర్తిగా తొలగించారు. ప్లాట్‌ఫామ్‌కు సమంగా ఉండేలా బోర్ల నుంచి నీటిని నింపుతున్నారు. ఆలయంలో కూడా పూర్తిగా రంగురంగుల చలువ పందిళ్లు వేసి భక్తులకు వేసవి బాధలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు.

కోనేటి చరిత్ర..

కడప రాయుని కోనేటి (పుష్కరిణి)కి చరిత్ర ఉంది. జిల్లాలోని పలు దేవాలయాల వద్ద కోనేర్లను మనం గమనించవచ్చు. అందులో ఈ పుష్కరిణికి విశిష్టమైన చరిత్ర ఉంది. చూడటానికి, వ్యవహారంలోనూ ఈ పుష్కరిణి కేవలం శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందినదేనని భావిస్తారు. కానీ ఆలయం ఎదురుగా అత్యంత సమీపంలో ఉన్న శ్రీ సోమేశ్వరస్వామి గుడికి ఈ పుష్కరిణి ఆనుకుని ఉండడం విశేషం. దీంతో ఈ పుష్కరిణి దేవునికడప శివాలయానికి కూడా చెందినదని పెద్దలు పేర్కొంటున్నారు. జిల్లాలో పెద్దదైన కడప రాయుని పుష్కరిణిని విజయనగర సామ్రాజ్య పాలకులు, సంగమ వంశీయులు, ప్రౌఢ దేవరాయులు 1442లో దుందుభి నామ సంవత్సరం భాద్రపద శుద్ధ ఏకాదశి నాడు పుష్కరిణి తవ్వకం పనులను ప్రారంభించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. పలువురు వాస్తు పండితులు నిర్మాణ రంగంలో నిపుణులైన వారితో చర్చించి ఈ కోనేరును నిర్మించారని తెలుస్తోంది. ఈ వివరాలన్నీ ఆలయ రంగమండపంలో మొన్నటివరకు శిలా శాసనంలో ఉండేవని కడప కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది.

- 1810–15 ప్రాంతంలో కల్నల్ మెకంజీ వద్ద రెవెన్యూశాఖలో పనిచేసిన ఉద్యోగి నారాయణరావు జిల్లాలోని శాసనాలు, వాటి వివరాలను గ్రంథంగా ప్రచురించారని కైఫీయత్తులలో పొందుపరిచారు. దేవునికడప ఆలయ రంగమండపంలో పుష్కరిణి నిర్మాణ వివరాలను తెలిపే శిలా శాసనం ఉండేదని, నారాయణరావు పరిశీలించినప్పటికే అది పగుళ్ల బారి ఉండిందని తెలుస్తోంది. ఈ వివరాల ప్రకారం దేవునికడప ఆలయ పుష్కరిణి అత్యంత పురాతనమైనదిగా చెప్పవచ్చు. ఇటీవల లక్షల రూపాయలు వెచ్చించి పుష్కరిణికి మరమ్మతులు చేశారు. చుట్టూ మురికి నీరు వెళ్లేలా కాలువలు నిర్మించి ప్రధాన ప్లాట్‌ఫాంతోపాటు కోనేరు చుట్టూ కూడా ఆధునికత కనిపించేలా రూపుదిద్దారు.



తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న కోనేరు

ఉత్సవాల వివరాలు..

కడప రాయుని తెప్పోత్సవాల వివరాలిలా ఉన్నాయి. బుధవారం శ్రీవారు శ్రీకృష్ణునిగా గోదాదేవితో కలిసి పుష్కరిణిలో మూడు ప్రదక్షిణలు నిర్వహించనున్నారు. గురువారం కడప రాయుడు శ్రీదేవి భూదేవి సమేతంగా ఐదుమార్లు, శుక్రవారం కూడా ఉభయ దేవేరులతో కలిసి శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుడు కోనేటిలో ఏడు మార్లు జల విహారం చేయనున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రతిరోజు సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 గంటల వరకు స్నపన తిరుమంజనం, 6.00 నుంచి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులు తెప్పలో స్వామి, అమ్మవార్లకు వేదపఠనం, భక్తి గీతాలాపనలు, మంగళ వాయిద్య నీరాజనం నిర్వహించనున్నారు.

పింఛన్ల పంపిణీ 94.01 శాతం

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. రెండవ రోజైన మంగళవారం మొత్తం 2,53,719 పింఛన్లకు గాను రూ. 70,01,59,750 పంపిణీ చేయాలి. అందులో 2,40,043 మందికి మొత్తం రూ. 65,23,43,000 నగదును పంపిణీ చేశారు. దీంతో 94.01 శాతం నమోదైంది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేయడం పట్ల అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఎర్రగుంట్ల : రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జగన్నాథ్‌రెడ్డికి పింఛన్ ఇస్తున్న వలంటీర్

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం


తాళిబొట్టును చూపిస్తున్న వేదపండితులు

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజుపాళెం మండలంలోని వెల్లాల గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వాముల కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వాములకు ఉదయం విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం సంజీవరాయ కల్యాణ మండపంలో ఉత్సవ విగ్రహాలకు నూతన పట్టు వస్త్రాలు, పుత్తడి ఆభరణాలతో అందంగా అలంకరించారు. ఒంటిమిట్ట నుంచి వచ్చిన వేద పండితులు చేసిన ఎదురుకోళ్ల కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. సర్పంచ్ కానాల రాధ, రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలా వెంకటరెడ్డి, జంగం రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఉభయదారులు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. జమ్మలమడుగుకు చెందిన సురేష్ బృందం ప్రదర్శించిన కోలాటం అందరిని అలరించింది.

రైలు కింద పడి వ్యక్తి మృతి



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు మంగళవారం రాత్రి తెలియజేశారు. మృతుడి వయసు సుమారు 65 నుంచి 70 ఏళ్లలోపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మృతుడి శరీరంపై గోధమ రంగు చొక్కా, బ్లూ రంగు గీతలు గల పంచ, టవలు ఉందన్నారు. ఎవరైనా గుర్తు పడితే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

- ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం
- మార్మోగిన 'బ్రహ్మ'నామస్మరణ


బ్రహ్మంగారిమఠం మాఢ వీధుల్లో శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు

బ్రహ్మంగారిమఠం : 'మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం' అంటూ భక్తులు పోటీపడ్డారు. స్వామి ప్రసాదం స్వీకరించడం కోసం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మంగారిమఠంలో ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు మధ్యాహ్నం మహాప్రసాదం వినియోగం చేపట్టారు. బియ్యం, బెల్లం, నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష, యాలక్కలు ఎండుకొబ్బరి, పాలు తదితరాలతో మహాప్రసాదాన్ని తయారు చేశారు. గర్భాలయంలో స్వామి వారి ఎదురుగా.. ఒక రాశిలా పోసి నివేదించారు. అనంతరం మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, పూర్వపు మఠాధిపతుల కుమారులు ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు స్వీకరించి కళ్లకు అద్దుకుని ఆరగించారు. మరికొందరు ఇంటికి తీసుకెళ్లారు. భక్తులతో క్యూలైన్‌లు కిటకిటలాడాయి. మహాప్రసాదానికి ప్రొద్దుటూరు నియోజకవర్గం సంకటితిమ్మాయపల్లెకు చెందిన ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

మహాప్రసాదం విశిష్టత

మహాప్రసాదం అనగా గొప్ప ప్రసాదం అని అర్థం. దేవతలకు నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేస్తారు. ఒక్కొక్క చోట ఒక్కో విధంగా ఇస్తారు. తమిళనాడులోని అన్ని శివాలయాల్లో విభూదిని ప్రసాదంగా అందజేస్తారు. అమ్మవారి ఆలయాల్లో కుంకుమ ఇవ్వడం జరుగుతుంది. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో 'విశేష గుడాన్నం' అందిస్తారు. దీనిని స్వీకరించిన వారికి సంతానం, వివాహం తదితర కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఉత్సవాలకు హాజరు కాలేని వారికి, తర్వాత వచ్చే వారికి ప్రసాదం అందించే పద్ధతి ఇక్కడ ఉంది. ప్రసాదాన్ని ఎండబెట్టి, తేమ లేకుండా నిల్వ చేసి సుమారు రెండు నెలల వరకు భక్తులకు అందజేస్తారు. కొందరు ప్రసాదాన్ని పార్శల్ ద్వారా తెప్పించుకుంటారు. నిద్రపోవు వారికి, నా వద్ద లేని వారికి ప్రసాదం అబ్బదు అనేది బ్రహ్మంగారి కాలజ్ఞాన వాక్యం. కావున భక్తులందరూ ప్రసాదం స్వీకరించడానికి అమితాసక్తి ప్రదర్శిస్తారు.

ఉత్సాహ భరితంగా ఉత్సవం

ఉదయం ఉత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. శ్రీ మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. తిరిగి పెద్దమఠం చేరుకున్నారు. కడపకు చెందిన అమృతమ్మ, వెంకటసుబ్బయ్య శ్రేష్టి, లక్ష్మీదేవి ఉభయదారులుగా వ్యవహరించారు. తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవారి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.


పూజ చేస్తున్న పూర్వపు మఠాధిపతి కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

హుండీ ఆదాయం లెక్కింపు



శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. గతేడాది తాత్కాలిక హుండీల ద్వారా 4.84 లక్షలు రాగా, ఈ ఏడాది 6.89 లక్షలు వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది, స్వామి శిష్యులు, భక్తులు లెక్కింపు చేపట్టారు.

అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై కేసు

చాపాడు : మడూరు గ్రామంలో అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మైనుద్దీన్ మంగళవారం వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన ఏనుగ గంగుల గారి శేషారెడ్డి (చిన్నయ్య) 1988లో సర్వే నంబర్ 24 నుంచి 27లో 5 ఎకరాల పొలాన్ని జి.పెద్ద వెంకటసుబ్బయ్య నుంచి రూ.44 వేలకు కొనుగోలు చేసి రిజిస్టర్ పొందాడని తెలిపారు. అయితే గ్రామానికి చెందిన ఎస్.రాంప్రసాద్‌రెడ్డి, ఎం.కుమార్, ఎల్లారెడ్డి పై భూములను ఏడేళ్ల క్రితం చనిపోయిన పెద్ద వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి భూమిగా సృష్టించి అతని భార్య పానమ్మ పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కేలా చేశారన్నారు. ఆమె వద్ద నుంచి 2021లో రూ.6.06 లక్షలకు భూములు కొన్నట్లు రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. దీనికి సంబంధించి శేషారెడ్డి ఫిర్యాదు మేరకు రాంప్రసాద్‌రెడ్డి, ఎం.కుమార్, ఎల్లారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పెన్నా నదిలో వృద్ధుడి గల్లంతు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని పి.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన ఏసు నారాయణ రెడ్డి (70) అనే వృద్ధుడు పెన్నానదిలో మంగళవారం సాయంత్రం గల్లంతు అయ్యాడు. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు మండలంలోని పి.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన ఏసునారాయణరెడ్డి సాయంత్రం కాలక్షేపం కోసం తన మనవళ్లను తీసుకొని పెన్నానదికి వెళ్లాడు. చిన్నారులు ఆడుకుంటుండగా ఆయన నదిలో దిగాడు. అయితే పెన్నానదిలో గుంతలు ఎక్కువ లోతులో ఉండటంతో కూరుకునిపోయాడు. స్థానికులు పట్టణ పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీస్‌లు గజ ఈతగాళ్లను రప్పించి గాలించారు. రాత్రి 9 గంటలు అయినా ఆచూకీ కనిపించలేదు. స్థానిక ప్రజలు కూడా పెన్నానదిలో గాలిస్తున్నారు.

నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్


ప్రశాంత్‌రెడ్డికి పర్స్, నగదు అందజేస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్

కమలాపురం : కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రీధర్ తనకు దొరికిన పర్స్ బాధితునికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. మండల పరిధిలోని పుట్లంపల్లెకు చెందిన గడికోట ప్రశాంత్‌రెడ్డి సచివాలయ సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం తన విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా క్రాస్ రోడ్డు వద్ద బ్యాక్ పాకెట్‌లో ఉన్న పర్స్ మిస్ అయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రీధర్‌కు ఆ పర్స్ కంట పడింది. దానిని తీసుకుని చూడగా అందులో రూ.6000 నగదుతోపాటు గుర్తింపు కార్డులు ఉన్నాయి. పర్స్‌లో ఉన్న గుర్తింపు కార్డులను బట్టి ప్రశాంత్‌రెడ్డిని స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ చిన్నపెద్దయ్య చేతుల మీదుగా పర్స్, నగదు అందజేశారు. ఆ కానిస్టేబుల్‌ను సీఐ సత్యబాబు, ఎస్ఐ చిన్నపెద్దయ్య అభినందించారు.

నెల్లూరు, అనంతపురం జట్ల విజయం


దత్తారెడ్డి, అనంతపురం (104 పరుగులు)


మాధవ్, నెల్లూరు (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 39.4 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని సాకేత్‌రామ్ 68 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు సూర్య 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు ట్టు 31.2 ఓవర్లలో 107 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని ధరణికుమార్‌నాయుడు 27 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ మాధవ్ 5 వికెట్లు తీశాడు. దీంతో నెల్లూరు జట్టు 73 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

అనంత జట్టు విజయం

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంత జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 44.2 ఓవర్లలో 256 పరుగుల వద్ద అనంత జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని దత్తారెడ్డి 69 బంతుల్లో 4 ఫోర్లు, 10 సిక్సర్‌లతో 104 పరుగులు చేశాడు. ఈయనకు జతగా రేవంత్‌రెడ్డి 35 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ ఇస్మాయిల్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 42 ఓవర్లలో 123 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని కనిష్ 34 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు దీపక్ 3, సంతోష్ 2 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు 133 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

బీటెక్ రవి రౌడీ చరిత్ర జిల్లా ప్రజలకు తెలుసు

ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్



కడప కార్పొరేషన్ : మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేకాట కింగ్ అని, అతని రౌడీ చరిత్ర జిల్లా ప్రజలందరికీ బాగా తెలుసని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటెక్ రవి దౌర్జన్యాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోయిందన్నారు. చక్రాయపేటలో ఎవరూ లేని సమయంలో ఓ స్థలంలోని గోడను దౌర్జన్యంగా కూల్చివేశారన్నారు. ఈ కేసులో బీటెక్ రవిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా నిలిచిన బీటెక్ రవి అధికార మదంతో ఎంతో మందిపై దౌర్జన్యాలు చేసి, దాడులు చేశారని గుర్తు చేశారు. సంఖ్యాపరంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది ఉన్నప్పటికీ బెదిరించి, ప్రలోభాలకు గురి చేసి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ పాకా సురేష్‌పై పట్టపగలు కార్పొరేషన్ ఎదుటే దాడికి దిగి, హత్యాయత్నం చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు మెప్పు కోసం వైఎస్ కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయనకు పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి వత్తాసు పలకడం దారుణమన్నారు. పోలీసులపై శ్రీనివాసులరెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. టీడీపీ దౌర్జన్యాలు భరించలేకే పులివెందుల ప్రజలు ఆ పార్టీని నామరూపాల్లేకుండా చేశారన్నారు. ఇప్పటికైనా వారు బెదిరింపులు, దౌర్జన్యాలను మానుకోకపోతే ప్రజలే చొక్కా విప్పి కొట్టే రోజులు వస్తాయన్నారు. బీటెక్ రవిలాంటి రౌడీకి చంద్రబాబుతో సహా ఎవరూ వత్తాసు పలకవద్దని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, ఎన్.సుబ్బారెడ్డి, త్యాగరాజు, హరిచందన్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు


పోరుమామిళ్ల బస్టాండ్ ప్రాంతంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

బద్వేలు : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్ల బస్టాండ్‌ను పరిశీలించారు. అంతకు మునుపు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీకి సంబంధించిన పలు సమస్యలను ఆయనకు నాయకులు వివరించారు. కాశినాయన మండలంలోని జ్యోతి క్షేత్రానికి మధ్యాహ్నం పూట బస్సు సౌకర్యం ఉండేలా చూడాలని మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి కోరారు. అనంతరం బస్టాండ్ భవనం పక్కనే మురుగు పేరుకుపోయిన ఆర్టీసీ స్థలాన్ని పరిశీలించారు. తదుపరి ఎమ్మెల్సీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బస్టాండ్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఈ ఉద్దేశంతోనే అధికారులతో కలిసి పరిశీలించేందుకు వచ్చామన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రకాల వసతులు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, వ్యవసాయ మండలి సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు ముత్యాల ప్రసాద్, అంకన గురివిరెడ్డి, పార్టీ కన్వీనర్ సీ బాషా, వైస్ ఎంపీపీ ముత్యాల ప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు అల్లా, నాయకులు రాళ్లపల్లి నరసింహులు, వసంతరాయలు, చాపాటి నారాయణరెడ్డి, రాళ్లపల్లి రవి, హబీబ్, ఆర్ఎం గోపినాథరెడ్డితో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సికాడా కీటకం.. అప్రమత్తత అవసరం

వైవీయూ పర్యావరణ సహ ఆచార్యులు ఎం.శ్రీధర్‌రెడ్డి


వైవీయూలో కనిపిస్తున్న సికాడా కీటకం

వైవీయూ : సికాడా కీటకాలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యోగివేమన విశ్వవిద్యాలయం పర్యావరణశాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎం. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ప్రధానంగా ఏప్రిల్, మే నెలల్లో విద్యార్థులు ఎండల నుంచి రక్షణ కోసమో, పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో చెట్ల కింద చేరుతుంటారని, అదే సమయంలో ఈ కీటకం చర్యలు తారాస్థాయికి చేరుకుని వీటి నుంచి సహించలేని శబ్దం వెలువడుతుందన్నారు. ఇటీవల కాలంలో వైవీయూ పరిసరాల్లో సికాడీ కీటకాలు పెద్దసంఖ్యలో కనిపిస్తుండటంపై ఆయన వివరాలు వెల్లడించారు. సికాడా కీటకాల నుంచి 60–70 డెసిబెల్స్ శబ్దం వస్తుందని, కీటకాల చర్యల వల్ల 80 డెసిబుల్ శబ్దం వాతావరణంలో పెరుగుతుందని, మిట్ట మధ్యాహ్నం ఇంకాస్త పెరుగుతుందని, ఇది ప్రమాదకరమని పేర్కొన్నారు. హోమోప్టెరా జాతికి చెందిన సికాడా మగ కీటకాలు, ఆడ కీటకాలను ఆకర్షించడానికి ఈ శబ్దాలు చేస్తుంటాయని తెలిపారు. సికాడా కీటకాల జీవిత చక్రం సుమారుగా ఏడాదిపాటు ఉంటుందని పేర్కొన్నారు. ఇవి ఎక్కువకాలం భూగర్భంలోని చెట్ల వేళ్ల రసాలను పీలుస్తూ జీవనం సాగిస్తాయన్నారు. వేసవి భూగర్భంలో వేడి పెరగడం వల్ల 6 సెంటీమీటర్లు పెరిగిన సికాడా కీటకాలు బయటకు వచ్చి రెక్కలను పెంచుకుని టేకు చెట్టు, కంపచెట్లు కాండం వద్దకు చేరుకుంటాయన్నారు. సికాడా మగ కీటకాల ఉదరం మీద ఇరువైపులా ఉండే టింబెల్ పొరలను అవి వేగంగా సెకనుకు 300 నుంచి 400 సార్లు కదిలిస్తూ శబ్దాలను చేస్తాయన్నారు. ఈ కీటకాలు చెట్లకు సంబంధించిన కణరసాలను పీల్చుకుంటూ బలాన్ని సమకూర్చుకుంటాయన్నారు. గత రెండు మూడు సంవత్సరాలుగా వైవీయూలో విరివిగా పెరిగిన చెట్లపై సికాడా కీటకాలు ఆవాసం ఏర్పరుచుకున్నట్లు విశ్లేషించారు. ఈ కీటకాల వల్ల నేలకు నత్రజని అంది మంచే జరుగుతుందని, కానీ సికాడా కీటకాలు అధికంగా పునరుత్పత్తి జరిగితే వీటిని ఆహారంగా చేసుకునే ఇతర కీటకాలు కూడా పెరిగే అవకాశం ఉంటుందని, ఇటువంటి పెస్ట్– ప్రిడేటర్ సంబంధాలపై పరిశోధనలు కొనసాగిస్తున్నట్లు ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు వి ద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్ర మాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కడప వైపు నుంచి కమలాపురం వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కడప వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనా ల్లో ప్రయాణిస్తున్న కిషోర్ కుమార్, నరసింహ అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స కోసం క్షతగాత్రులను 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

దయలేని పుత్రుడు

తన రక్తం చిందించి పెంచి పెద్ద చేసిన తండ్రి బాగోగులు చూసుకోలేదు.. అనారోగ్యం బారిన పడినా పట్టించుకోలేదు.. ఆసుపత్రి పాలైనా కడసారైనా చూద్దామనుకోలేదు.. చివరకు చనిపోతే అంత్యక్రియలు నిర్వహించకుండా మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయాడు. ఈ కుమారుడి తీరు చూసిన వారు.. 'తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుడు..' అన్న ప్రజాకవి యోగి వేమన మాటల్ని గుర్తు చేసుకున్నారు.

- గువ్వలచెరువు ఘాట్‌లో తండ్రి మృతదేహం పడేసి వెళ్లిన వైనం
- పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి..


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.డి.షరీఫ్

కడప అర్బన్ : చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలోని గువ్వల చెరువుఘాట్‌లో ఇటీవల ఓ వ్యక్తి.. తన తండ్రి మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయాడు. ఆ రహదారిలో వెళుతున్న వారు మృతదేహాన్ని గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కుమారుడిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై మంగళవారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వివరాలు తెలియజేశారు. గత నెల 29న చింతకొమ్మదిన్నె మండలం కడప–రాయచోటి (ఎస్‌హెచ్–40) ఘాట్ రోడ్‌లోని నాలుగో మలుపు సమీపాన లోయవైపు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్థానికులకు కనిపించింది. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సమయంలో గవర్నమెంట్ ఆఫ్ ఏ.పి సప్లై అనే అక్షరాలు కలిగిన ఆసుపత్రికి సంబంధించిన తెలుపు బెడ్‌షీట్, పసుపురంగులో వున్న కేన్‌లా పైపు, యూరిన్ ప్లాస్టిక్ బ్యాగ్‌ను చూశారు. సదరు వ్యక్తి కడప రిమ్స్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని గుర్తించారు. చనిపోయిన తరువాత దహన సంస్కారాలు చేయకుండానే పడేసి పోయారని భావించారు. మృతదేహం వద్ద లభ్యమైన స్లిప్‌లలో ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేశారు. సదరు వ్యక్తి మృతదేహం జిల్లాలోని దువ్వూరు మండలం చిన్నసింగనపల్లె గ్రామం బొమ్ము చిన్నపుల్లారెడ్డిది అని తేలింది. ఆయనకు ఏకైక కుమారుడు బొమ్ము రాజశేఖర్ రెడ్డి. తన తండ్రి చిన్నపుల్లారెడ్డి కొన్నేళ్లుగా టి.బి జబ్బుతోపాటు ఊపిరితిత్తుల సమస్య, ఆయాసం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వున్నా, ఆయన బాగోగులు చూసుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. దీంతో చిన్నపుల్లారెడ్డి ఇంటిలో ఎవరికీ చెప్పకుండా కడప రిమ్స్‌లో చికిత్స కోసం చేరాడు. ఆసుపత్రి వారు ఫిబ్రవరి చివరి వారంలో రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి, మీ తండ్రి రిమ్స్‌లో తీవ్ర విషమ పరిస్థితిలో వున్నాడని సమాచారం ఇచ్చారు. దీంతో అతను తన తండ్రిని రిమ్స్ నుంచి డిశ్చార్జ్ చేయించుకుని ఇంటికి తీసుకుని వెళుతుండగా.. ఆసుపత్రి ఆవరణలోనే మృతి చెందాడు. తరువాత ఆటోను బాడుగకు మాట్లాడుకున్నాడు. తన తండ్రికి అంత్యక్రియలు చేసే స్తోమత లేక ఎవరికీ చెప్పకుండా గువ్వల చెరువు ఘాట్‌లో నాలుగవ మలుపు వద్ద మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయాడని విచారణలో తెలియజేశాడని సీఐ తెలిపారు. అతనిపై సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు. ఈ సమావేశంలో కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి, ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.